# అందమె ఆనందం

"అందమె ఆనందం, ఆనందమె జీవిత మకరందం" అన్నాడో కవి.

మనిషికి జ్ఞానమొచ్చినప్పటినుంచీ (రానప్పుడు కూడానేమో) అందాన్ని ఆరాధిస్తూనే ఉన్నాడు. అందాన్ని అందలమెక్కిస్తూనే ఉన్నాడు.



ఇక కవులు అందగత్తెల్ని వేనోళ్ల పొగుడుతూనే ఉన్నారు. అందం "అందాల్ని" రకరకాలుగా వర్ణిస్తూనే వున్నారు. ఈ వర్ణనలు ఎప్పుడో వచ్చిన ప్రబంధ కవిత్వంలో ఎక్కువగా కన్పిస్తాయి.

ఓ కవి ఆమె ముఖం చంద్రబింబం అన్నాడు. మరో కవి పద్మం అన్నాడు. అలాగే ఓ కవి ఆమె కన్నులు చేపకళ్లలా ఉన్నాయంటూ మీనాక్షి అన్నాడు. ఇంకో కవికి ఆమె తొడలు అరటి బోదెల్లా కనిపించాయి. మరో కవికి ఆమె వక్షోజాలు కొండల్లా కనిపించాయి. ఆమె పలువరస ఇంకో కవికి దానిమ్మ గింజల్లా అనిపించింది.

అందం దగ్గరకొచ్చేటప్పటికి నాటి కవులు తెగ విజృంభించేసేవారు. శ్రీనాథుడు వర్ణనలతోనే సరిపెట్టలేదు....... ఇక పోతన సరస్వతీ దేవి దుఃఖం గురించి చెప్పేటప్పుడు కూడా "కాటుక కంటినీరు చనుకట్టు పై బడి ..." అంటూ వర్ణించకుండా ఉండలేకపోయాడు. వరూధిని గురించిన అల్లసాని పెద్దన వర్ణనలు సరేసరి.

చలం కూడా 'స్త్రీ' అందాన్ని తన పద్ధతిలో వర్ణించాడు. జానికి అనే నవలలో ఆమె అందం చూసి "...... రాజు పడవైనా ఎందుకు? ఏమి అందం! ఆమె పెద్ద నల్లని జుట్టు నొక్కులు నొక్కులుగా, సముద్రపు అలలు కడిగిన నల్లని యిసుక వలె పక్కమీద పరుచుకుని వుంది. పక్కకి తిరిగి పడుకున్నప్పటి పిరుదుల వంపు, ఆ మెడ దగ్గర్నించి, మెల్లిగా భుజాలతో పైకిలేచి, చేతి కిందనుంచి నడుము వరకు తగ్గి, మళ్లీ ఎత్తుగా, పిరుదుల నుంచి కాలి వరకు వొంపుగా తగ్గుతో అందమె ఆనందం... కనపడ్డం ఆ అందంతో అతని (సూర్యనారాయణ) కళ్లు తిరిగిపోయినాయి. మెల్లిగా ఊపిరితో లేచిపడే ఆ వక్ష భారం జాకెట్టు కింద కనపడే మెరుపు, అతన్ని అమితంగా బాధపెట్టాయి"...అంటూ వర్ణించాడు.

అలాగే యవ్వనం అనే నవలలో "ఆ తెల్ల పళ్ల నవ్వు గులాబీ పెదవుల మధ్య; చంకల వరకు నున్నని తెల్లని చేతులు, రహస్యాలు పలికే మెడవొంపు, ఎత్తయిన వక్షం మీద వూగిసలాడే పూసల వజ్రహారాలు! ఆమె పాట, నడక, కనుకొలుకుల్లోంచి చూపులు..." అంటాడు చలం.

స్వామి కన్నులచ్చటి నుండి కదలి యామె వక్షోజ మండలమును గాంచెను. అచ్చటను బృథుత్వమే గోచరించెను. దిగి, జఘన భాగమునకు వచ్చెను. అచ్చటను బృథుత్వమే గోచరించెను. ఆకుపచ్చని చీర -సస్యశ్యామలత్వము, ఘన నక్షోజములు -గిరి సహితత్వము... పాదములు -కన్నులు- గిరిక పృథ్వినీ సంపూర్ణ స్వరూపము వలె గోచరించెను"అంటూ వర్ణిస్తాడు విశ్వనాథ సత్యనారాయణ.

కె.వి.యస్.వర్మ ఫీచర్స్

ఆమెకి గంపంత కొప్పు, కుండంత గుండే వున్నాయి. రంగు పాలకోవా రంగులో వుంది... ఆమె చిన్న నోరు ఎర్ర దానిమ్మపండు పగుల్లా వుంది...సరదాకి రాణిగారెవరో బీద భామ వేషం వేసినట్టు నిటారుగా నిలబడి"... అంటూ వర్ణిస్తాడు రా.వి. శాస్త్రి 'అగ్గిపుల్ల' కథలో.

'దూరంగా వున్న కొండ ,గుండెలు తప్ప మనిషి కనపడని నాయుడిగారి వుంపుడు కత్తెలా వుంది' అంటాడు ఆర్. జగదీశ్వరరావు తన' గ్రామాయణం' నవలికలో.

"అందానికి ఇరవై ఏళ్లొస్తే ఆమెలా ఉంటుంది" అని అన్నాడు. డి. వెంకట్రామయ్య అనుకుంటాను ఓ కథలో.

స్త్రీ సౌందర్యాన్ని ఎందరో ఎన్నో విధాలుగా వర్ణించారు. ఆడవాళ్ల అందాల్ని సినిమాల్లో ఎన్ని రకాలుగా చూపిస్తున్నారో నేను చెప్పాల్సిన పనిలేదు.

ఏ వ్యాపార ప్రకటన చూసినా ఆడవాళ్ల వివిధ భంగిమలుంటాయి. ఇప్పటి అనేక సినిమాల్లో, అడ్వర్‌టైజ్‌మెంటుల్లో అందం అంటే ఆడదాని అవయవ సంపదను చూపించడమే కనిపిస్తోంది. కొన్నిటిలో అశ్లీలమూ ఉంటోంది. దీన్ని వ్యతిరేకిస్తూ కొన్ని మహిళా సంఘాలు ప్రదర్శనలూ చేశాయి.

అందం అంటే చాలామంది దృష్టిలో కనుముక్కు తీరు బావుండడమూ, తెల్లగా ఉండడమూ, శరీర సౌష్టవం చక్కగా ఉండడమూనూ.

మిస్ ఇండియా, మిస్ యూనివర్స్ పోటీల్లోనూ అదే దృష్టి మొన్నటిదాకా వుంది. ఛాతీ, పిరుదులూ, నడుముల కొలతలకే ప్రాధాన్యం. ముఖ సౌందర్యమూ, ఎత్తూ చూస్తారనుకుంటాను.

ఇటీవల జరిగిన ప్రపంచ సుందరి పోటీలో భారతీయ యువతి సుస్మిత జగదేక సుందరిగా ఎన్నికయింది. ఒట్టి అందం వరకైతే ఆమెతో పాటు మరో ఇద్దరు చివరికంటా నిలిచారు. తెలివితేటల పరీక్షలో సుస్మితే నెగ్గింది.

'స్త్రీ అంటే ఏమిటి' అని అడిగినప్పుడు 'స్త్రీ అంటే దేవుడిచ్చిన కానుక. ఎందుకంటే. స్త్రీ మానవులకు జన్మనిస్తుంది. మగాడికి ప్రేమ గురించి చెబుతుంది. సాకుతుంది, పాలు పంచుకుంటుంది' అని సుస్మిత చెప్పింది.

సౌందర్యం అంటే కేవలం అందమే కాదు, వివేకం కూడా.

29.5.94

ఆంధ్రభూమి దినపత్రిక